# ప్రేమ పుష్పాలు!



★

రచన:
శ్రీ బుద్ధిరాజు నరసింహారావు

(గతసంచిక తరువాయి)

చలపతిరావూ సీతా వీపు అటువైపు వుండడంవలన తిరిగి చూడలేకపోయారు. తిరిగిచూస్తే మర్యాదాగాకూడా వుండదని అలానే కూర్చున్నారు.

తల్లి భుజం పట్టుకుని లోపలికివచ్చిన చక్రవర్తి వారిని గుర్తుపట్టాడు.

'అరే మీరు వచ్చారా!' అన్నాడు ఆశ్చర్యపోతూ.

'మీ అమ్మగారి ఆరోగ్యం బాగులేదని అసలు నువ్వు చెప్పనే లేదేం బాబూ!' సీత అతణ్ని మందలించింది.

వారు దగ్గరికిరాగానే మర్యాదగా యిద్దరూ లేచారు.

'కాంతం. ఈయన.'

భాస్కరరావు పరిచయం చేసేలోపలే కాంతం ఆయన ప్రక్కగా వచ్చింది.

చలపతిరావునిచూసి ఆమె నిర్ఘాంతపోయింది. చలపతిరావుకూడా తెల్లబోయాడు.

కాంతం వదనం కఠోరంగా మారింది.

కళ్ళు చింతనిప్పుల్లా అయ్యాయి.

'నువ్వా!.

చలపతిరావు నిశ్చేష్టుడై అలానే రాతిబొమ్మలా నిలబడిపోయాడు.

శరీరంలో రక్తం గూడుకట్టుకు పోయినట్లయింది.

మెల్లిగా ఊపిరిపీలుస్తూ, 'అక్కయ్యా!' అన్నాడు.

నోర్ముయ్!' కాంతం బిగ్గరగా అరచింది.

ఎవరికీ ఏమీ అర్థం కానట్లు భాస్కరరావు, చక్రవర్తి ఒకరిముఖా లొకరు చూసుకున్నారు.

కాంతం కోపోద్రేకాలతో వణికిపోతూ, 'నీవేనాడో చచ్చిపోయావనుకున్నాను. యింకా బ్రతికేవున్నావా!'

'అక్కయ్యా, నామాటవిను. చలపతిరావేదో అనబోయాడు.

'ఛీ. ఛీ. నీ నోటివెంట నన్నలా పిలవకు. అసలు నా గడప తొక్కడానికి అంతధైర్య మెలా వచ్చింది!'

'అక్కయ్యా, నన్నపార్థం చేసుకోకు. నేను, నాకసలు యిది నీయిల్లని తెలియనే తెలియదు.'

'తెలిసిందికదా, ఇహ బైటకు వెళ్ళు!'

భర్త నామె అలా అవమానపరుస్తూవుంటే సీత వినలేకపోయింది.

'కాంతంగారూ, అంతమాటనడం మీకు సబబుగా లేదు.'

'నోర్మూసుకోవే. అసలు నీనోటెంట మాట లెలా పెగులుతున్నాయో నాకర్థం కావడంలేదు. ఏం. మా అమ్మా నాన్నా ప్రాణాలు బలితీసుకున్నా యింకా నీదాహం తీరలేదా?'

'కాంతం, ఏమిటా మాటలు.'

భర్త భాస్కరరావు సముదాయించబోయాడు.

'అమ్మా. నీ ఒంట్లో బాగులేదు. అంత ఆవేశంగా మాట్లాడకు.' చక్రవర్తి తల్లితో అన్నాడు.

'ఇంక నా ప్రాణానికేంరా. వచ్చాడుగా మహానుభావుడు. వీడిమొహం చూసానుకదా, నాప్రాణాలుకూడా తీస్తేనేగాని వీడిహృదయం చల్లబడదు.'

కాంతం మరీ రెచ్చిపోయింది.

'అక్కయ్యా, ఆదినుండీ మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. అప్పుడు నేనొక మంచిపని చేస్తున్నా ననే ధ్యాసతప్ప ఎటువంటి దుర్బుద్ధీ నాకులేదు. అమ్మా నాన్నా కూడా నన్నూ నావ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోలేక ఎప్పుడూ కోలుకోలేని మనోవేదనకి గురయ్యారు. నువ్వు శాంతంగా వింటే నన్నర్థంచేసుకొని, నన్ను క్షమించగలవక్కా.' చలపతిరావు దీనంగా అన్నాడు.

'హుం; వ్యక్తత్వంకు వ్యక్తిత్వం. పసికందునించి ప్రాణానికి ప్రాణంగా, నిద్రాహారాలుమాని ఎటువంటి వెల్తీ రానీకుండా నిన్ను పెంచి పెద్దచేసిన తల్లి దండ్రులకే వెన్నుపోటుపొడిచే ఆల్పుడికా వ్యక్తిత్వం. నీవు వారి పరువు ప్రతిష్ఠలను లెక్కచెయ్యకుండా పరారీ అయ్యావు. కులంలేని, అర్హతలేని ఆడదానికి బానిసగా మారావు. అదేనా నీవ్యక్తిత్వం? నవమాసాలుమోసి కని పెంచి పెద్దచేసిన ముద్దులబిడ్డే విశ్వాసఘాతకుడుగా మారాడా అనేబాధతో కుళ్ళి విలవిలలాడుతూ తల్లి మరణిస్తున్నప్పుడు ఎక్కడికి పోయింది నీవ్యక్తిత్వం? తర్వాత కొన్నేళ్ళకు భార్యా వియోగంతో కృంగిపోయి, దిక్కులేక ప్రతిక్షణం విన్నే తలచుకుని, రమ్మనమని ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, రాలేదు కదా, కనీసం జవాబుకూడా యివ్వలేదు. యిదేనా నీ వ్యక్తిత్వం? చివరకు 'నాయనా చలం నాయినా, ఒక్కసారి రారా' అని ఘోషపెట్టి గుండెపోటుతో తండ్రి మరణించాడే. యిదేనా నీవ్యక్తిత్వం? అంటే. కొడుకు వుండికూడా తల కొరివిపెట్ట దిక్కులేనివారిగా అమ్మా నాన్నా పోయారు, అసలు నీకూ ఒక వ్యక్తిత్వం వుందంటే నమ్మేదెవరు? నీకు. నీకు.!' అంటూ ఆయాసంలో, ఆవేశంతో తూలిపడి పోయింది కాంతం.

చక్రవర్తి తల్లిని ఆదుకొని, 'ఊరుకోమ్మా: ఊరుకో' అన్నాడు.

సీతకి కథ అర్థమౌతున్నా నోటివెంట మాట రావడం లేదు.

చక్రవర్తి తనకొక మేనమామ వున్నాడని యింత వరకూ తెలియదేనని ఆశ్చర్యపోతున్నాడు.

భాస్కరరావు అసలేమీ అర్థం కానట్లు భార్యవైపు చూస్తున్నాడు మౌనంగా.

'అక్కయ్యా, నాన్నగారు నాకు ఉత్తరాలు వ్రాసారని నాకు తెలియదు. లేకపోతే,..'

అతనిమాట పూర్తి కాకుండానే కాంతం ఓపిక నశించింది. ఉద్రేకంతో బిగ్గరగా, 'నిన్నుచూస్తే, నాకసహ్యం వేస్తోంది. మర్యాదగా యిక్కడనుండి వెళ్ళు;'

'అక్కయ్యా, నామాట...!'

'ఆఖరిసారిగా చెప్తున్నాను, మర్యాదగా వెళ్ళేవా సరేసరి. లేదా నేనేపోయి బావిలో దూకుతా.'

'అంతమాటనకు అక్కయ్యా, వెళ్ళిపోతాను.'

మా ప్రత్యేక తయారింపులు : :

♦ 100% ఫైన్ ♦ పాయల్ ఫైన్
♦ జిప్సీ ఫైన్ ♦ మైసన్ ఫైన్
♦ రాకెట్ ఇంటర్ లాక్

R.K.S. KNITTINGS TIRUPUR

Regd. No. 342215

**R. K. S. Knittings**

43, Cauvery St, TIRUPUR - 638 602.

చలపతిరావు వెనక్కి తిరిగాడు.

సీత భర్తని అనుసరించింది.

'ఇదుగో ఈమాటకూడా విని వెళ్లు. యింకా నీకో అక్క వున్నదని గుర్తుంటే, నే బ్రతికున్నంతకాలం నీ ముఖం తిరిగి నాకు చూపకు. నామీద ఒట్టు!'

'నీమాట నిలబెడతా నక్కయ్యా.' అంటూ భార్య చేయి పట్టుకుని చలపతరావు చరచరా బయటకు వెళ్ళిపోయాడు.

చక్రవర్తి నిశ్చేష్టుడై అటువైపే చూస్తూ వుండిపోయాడు.

* * *

ఆనాడు భాస్కరరావు యింటినుండి అంతులేని అవమానంతో తిరిగి వచ్చిన చలపతిరావు మంచం పట్టాడు.

ఎప్పటినుంచో దాగివున్న గుండెపోటు అతణ్ణి అమాంతం కదిలించివేసింది.

భర్త స్థితిచూసి లోలోన కుమిలిపోసాగింది సీత.

తల్లి తండ్రి చక్రవర్తితో తన పెళ్లి నిశ్చయం చేసుకు వస్తారని ఎంతో సంతోషంతో ఉప్పొంగిపోయిన జయసుధ స్వప్నాలన్నీ చెట్టునుండి రాలిన ఎండుటాకులవలె చెల్లా చెదరై పోయాయి.

ఎంతో సంతోషంగా గంటలతరబడి పంచాంగంలో శుభసమయంచూసి, తనను చిలిపి చిలిపిమాటలతో హాస్యం పట్టించి వెళ్ళిన తండ్రి గుండెపట్టుకుని రిక్షాలోంచి దిగే వరకి జయసుధకీ ప్రభకీ మతిపోయినట్లయింది.

ఇంట్లోకిరాగానే చలపతిరావు మొహంతిరిగి పడిపోయాడు'

అందరూ ఆందోళన చెందారు.

'ప్రభా, యిక్కడే వుండమ్మా. నేను డాక్టర్ని తీసుకొని వస్తా'నంటూ గాబరాగా బయటకు పరిగెత్తింది జయసుధ,

ఆమె డాక్టర్ని వెంటబెట్టుకుని వచ్చేటప్పటికి ప్రభ తండ్రి గుండెలకి నూనెరాసి మర్దనా చేస్తోంది.

తల్లి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

డాక్టర్ చెక్‌చేసి ఇంజెక్షన్ యిచ్చి, కొన్ని మందులూ మాత్రలూ యిచ్చి, 'ఏదో షాక్ తగలడంవల్ల గుండెపోటు వచ్చింది. బ్లడ్ ప్రెషర్‌కూడా హైగా వుంది. అందుకని చాలా జాగ్రత్తగా వుండాలి. ఆయనకు ఉద్రేకం కలిగించేవీ, మనసుని నొప్పించేవీ సంఘటన లేమైనా జరుగ కూడదు. రెస్ట్ అతిముఖ్యం.' అనిచెప్పి బయటకు నడిచాడు.

జయసుధ అతణ్ణి సాగనంపింది.

ఆరాత్రి ఎవరూ భోజనం చెయ్యలేదు. అసలు భోజనం చెయ్యడానికి మనసొప్పలేదుకూడా.

అక్కయ్య పెళ్ళిమాటలకి అమ్మా, నాన్నా వెళ్ళారని ఆనందిస్తున్న ప్రభ, వుండలేక ఏకాంతసమయంలో అక్కనడిగింది. 'అక్కయ్యా, వాళ్లు నాన్ననేదో అనరానిమాట లనేవుంటారు. లేకపోతే అంతగా బాధపడతారా! అమ్మకూడా వచ్చిన దగ్గరనుండి అదోలా వుంది.'

'అదే నాకూ అంతుపట్టడంలేదు ప్రభా. అమ్మనైనా అడుగుదామంటే ధైర్యం చాలడంలేదు. చక్రవర్తి వ్యక్తిత్వం చూస్తే వాళ్ళువాళ్ళు చాలా ఉత్తములై వుంటారనే అనుకున్నాను. కాని, ఏమైందో!'

'పోనీలే అక్కయ్యా, యిప్పుడు కాకపోయినా, మరో నాడైనా తెలుస్తుంది కదా' అంది ప్రభ.

రాత్రి పదకొండు దాటింది.

అప్పటికి ఎవరూ పడుకోలేదు.

'చాలా టైం అయింది పడుకో అమ్మా ...నే నాన్న దగ్గరే వుంటాను.'

'లేదమ్మా నే నే వుంటాను.... నీవు చిన్నదానివి. పోయి రెస్టు తీసుకో.'

'పర్వాలేదమ్మా, నువ్వెళ్ళి పడుకో, ప్రభా. నీవు కూడా వెళ్లు. రేపటినుంచి నీ పరీక్షలు కదా, అంది జయసుధ.

అప్పటికే చలపతిరావుకి తెలివొచ్చినా మగతగా, ఇంజెక్షన్ ప్రభావం వల్ల కాబోలు పడుకున్నాడు.

సీతా ప్రభా ప్రక్క గదిలోకి వెళ్ళి పడుకున్నారు.

జయసుధ కాలక్షేపానికి సైకాలజీ పుస్తకం తీసి చదువుతూ కూర్చుంది.

గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

అప్పుడే జయసుధ కనులు మూత పడ్డాయి.

ఆమె తండ్రి ప్రక్కనే తల వాల్చింది.

కనులముందు తండ్రి రూపం ప్రత్యక్షమైంది.

తనకి జ్ఞానం వచ్చిన దగ్గర నుండి తండ్రి తనని ఎంతో గారాబంగా, అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసాడు. ప్రభ కంటే ఎక్కువగా తల్లీ దండ్రి తమ ప్రాణాల కంటే ఎక్కువగా తనని చూస్తూ వచ్చారు. అలాంటిది. ...

'అమ్మా, జయా!'

తండ్రి కంపిస్తున్న స్వరానికి ఉలిక్కిపడింది జయసుధ'

వెంటనే కళ్ళు విప్పి తండ్రిపై వొంగి ఆయన ముఖం తుడుస్తూ ఆప్యాయంగా, 'ఏం నాన్న, ఏమైనా కావాలా?'

'కాస్త మంచినీళ్ళమ్మా, మా బంగారు తల్లివి కదూ?'

తండ్రి మాటకి ఆమె కనుకొలనుల్లో గిర్రున నీటి పొర చుట్టుకుంది.

'తెస్తాను నాన్న.' వెంటనేలేచి చెంబులోవున్న నీళ్ళు గ్లాసులో పోసి తెచ్చింది.

'నోరు తెరవు నాన్నా.'

చలపతిరావు మెల్లిగా కళ్ళుతెరచి నోరిప్పాడు.

ఆమె కొంచెం కొంచెంగా తండ్రికి నీళ్ళు పట్టింది.

చలపతిరావు కృతజ్ఞతగా జయసుధ వైపు చూసాడు.

జయసుధ కళ్ళు ఆయన కళ్ళతో అప్రయత్నంగానే కలుసుకున్నాయి. అప్పుడే ఆయన కళ్ళల్లో నీరు నిండి వుండడం చూసింది జయసుధ. ఆమెకి తన మనసుని ఎవరో ముక్కలు ముక్కలుగా కోస్తున్నట్లయింది.

'అదేమిటి నాన్నా. నీ బాధ నేను చూడలేను నాన్నా.' అంది జయసుధ బాధగా.

'అమ్మా జయా. నీ ఋణం జన్మ జన్మలకీ తీర్చ లేనమ్మా, నీలా సేవలు నా కెవరు చేస్తారు చెప్పు. కాని, నీకు నే నిచ్చిందేమిటమ్మా, కొరిన ఓ చిన్నకోరిక తీర్చలేక పోయాను.'

'ఊరుకో నాన్నా, ఏమిటా ఆలోచనలు. అలాంటి వేవీ మనసులో పెట్టుకుని బాధపడకు. రెస్టు తీసుకో.' అంటూ తండ్రి ముఖం పైటచెంగుతో తుడిచి దుప్పటీ కప్పింది.

'వద్దమ్మా. నీ సేవకి నే తగనమ్మా, నన్ను క్షమిస్తావా తల్లీ, నే నసమర్థుడ్ని.

తండ్రి అంతలా బాధ పడడం తనదే మొదటి సారి చూడడం.

'కళ్ళు మూసుకుని పడుకో నాన్నా. అదుగో, బాధపడితే నా మీద ఒట్టే!'

'ఒట్టేయకమ్మా,' అని కళ్ళు మూసుకున్నాడు చలపతి రావు.

కొంతసేపటికి ఆయన పడుకున్నాడే కాని, జయసుధ పడుకోలేదు. తండ్రి అంతలా ఎందుకు బాధ పడుతున్నాడో అర్థం కాలేదు.





BAJAJ KNITTERS.S.INDIA.

మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్ * మాసర్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స్ * కాపిటల్
* సంగమ్ ఇంటర్ లాక్ * ఓవిన్
* టిప్‌టాప్ * కింగ్ కాంగ్
* కై రాజ్ * రాకెట్

ఇవికాక ƒ జెట్టీలు ƒ లండన్ ƒ సిమిత ƒ బాబి అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు అన్ని ప్రముఖ బట్టల షాపులలోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 602.

నిద్రలో చలపతిరావు పచ్చిగా కలవరిస్తున్నాడు. 'అమ్మా, ఈ అభాగ్యుడిని క్షమించమ్మా, నీ కోరిక నేనీ జన్మలో తీర్చలేనేమో, వద్దమ్మా. నాపై నంతకోపంగా చూడకమ్మా, ఈ ఆవేదన నే భరించలేనమ్మా, కని పెంచి పెద్ద చేసిన తల్లీ దండ్రే కాదు, అక్కకూడా నన్నపార్థం చేసుకుంది. నీవు కూడా, వద్దమ్మా, జయా.'

జయసుధకి విని నిట్టూర్పు విడవడం తప్ప ఏం చెయ్యాడమో తెలియలేదు.

* * *

ఆ రెండోరోజు భాస్కరరావు మెల్లిగా భార్యని అడిగేడు. 'కాంతం నీకో తమ్ముడున్నాడని నాతోకూడా చెప్పకుండా దాచివుంచావు. అసలువిషయ మేమిటి?'

'అది నిజమేనండి. ఆ తప్పుకి నన్ను క్షమించమని మిమ్మల్ని వేడుకుంటున్నాను.' అని మంచంమీదనుండి లేవబోయింది కాంతం.

'లేవకు, పడుకో కాంతం' చేయిపట్టుకుని ఆప్యాయతగా అన్నాడు భాస్కరరావు.

'ఎలా పడుకోవడమండీ. వాడు రావడం కాదుగాని నా జీవితంలో మళ్ళీ చిచ్చు రేపిపోయాడు. గుండె భారంగా తయారైంది. హృదయం ముక్కలై పోయింది!' అంది కంట తడి పెట్టుకుంటూ.

'వద్దు కాంతం. ఆయినా అత నెందుకువచ్చాడో తెలుసా, మనబాబుకి వాళ్ళమ్మాయిని ...'

అతనిమాట పూర్తి కాకుండానే కాంతం రెచ్చిపోయింది. అప్పుడే ఆ గదిలోకి రాబోయిన చక్రవర్తి తలుపువద్దే నిలబడిపోయి వారి సంభాషణ వినసాగాడు.

'సంబంధమా, అనీచుడు తనకూతుర్ని మనబ్బాయి కిస్తానన్నాడా. ఛి. ఛి. నాకంఠంలో ప్రాణముండగా అది జరిగేపని కాదు. నాదో చిన్నమనవి. అంగీకరిస్తారా?'

'తప్పకుండా!'

'మీరాసంబంధం చెయ్యమని నన్ను బలవంతం చెయ్యరు కదూ?'

భర్తవైపు దీనంగా చూసించి కాంతం.

భాస్కరరావు ఆమెచేయి మృదువుగా పట్టుకుని ప్రేమగా అన్నాడు. 'నీమాట నేనెప్పుడైనా కాదన్నానా కాంతం. కాని, మనసులు కలిసి ఒకరి నొకరు ప్రేమించుకున్న జంటని విడదీయడం భావ్యం కాదనుకుంటాను కాంతం.

కాంతం నమ్మలేనట్లు అతనివైపు చూసింది.

'ఏమిటీ, మన బాబు ప్రేమించాడా?'

'అవును కాంతం. మన బాబూ, వాళ్ళమ్మాయి జయసుధా ప్రేమించుకున్నారట!'

'అయ్యో, ఎంతపని జరిగిపోయిందండీ. కాదు, అదెన్నటికీ జరగనిపని. మనబాబు అలాంటివాడు కాదు. నా అనుమానం, ఆ దిక్కులేనివాడే తెలిసుండి అలా నాటకమాడి మన అబ్బాయిని వలలో వేసుకునుంటాడు. యిలాగైనా అక్క ఆదరిస్తుందేమో నని. కాని, ఆది వాడిభ్రమ!'

చక్రవర్తి యిక వినలేక గదిలోకి వచ్చేసాడు.

'రా బాబు, కూర్చో.' అంది తల్లి కాంతం.

తల్లి ప్రక్కగా కూర్చున్నాడు చక్రవర్తి.

'అమ్మా, చలపతిరావుగారు నాకు మేనమామ అవుతారా?'

'అలా అనకు బాబూ; చలపతిరావనే నా తమ్ముడొకడుండేవాడు. కాని వాడు ఏనాడో మరణించాడు.

'మరీయనెవడు?' చక్రవర్తి ఆశ్చర్యంగా అడిగేడు.

'వీడా? జాతి కులం లేని, కని పెంచి పెద్దచేసిన తల్లి తండ్రులకే వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు.'

(సశేషం.)


కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం. 1938

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 12-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్‌బాథమ్స బుక్‌స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలివీధి,

మదరాసు - 600 079.